ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 4 ఫిబ్రవరి 2026 www.prajaswaramdailly.com 4 PM

ఏసీబీకి చిక్కిన కూకట్‌పల్లి ఎస్ఈ

రూ.15 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న...

హైదరాబాద్, ప్రజాస్వరం

రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి అధికారులకు చిక్కారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు.

ఓట్లు చీలకుండా. గెలుపే లక్ష్యంగా

మంత్రులు అందరూ జిల్లాలకు వెళ్లాలి

కొన్ని మున్సిపాలిటీల్లో తప్ప

అన్ని చోట్ల పార్టీకి సానుకూలం

పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జులదే గెలుపు బాధ్యత

సీఎం రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేష్

హైదరాబాద్,ప్రజాస్వరం
అందరూ సమిష్టిగా పనిచేయాలని.. ఒక్క ఓటు కూడా చీలకుండా జాగ్రత్త పడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ , నగర పాలక సంస్థల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉందని మరింత కష్టపడాలని పార్లమెంటు నియోజక వర్గ ఇంఛార్జులకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లు దిశానిర్దేశం చేశారు. వివిధ సర్వేలను ముందు పెట్టుకుని సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి... కొన్ని మున్సిపాలిటీల్లో తప్ప అన్ని చోట్ల పార్టీకి సానుకూల వాతావరణం ఉందని అభిప్రాయపడ్డారు.

మంత్రులు అందరూ జిల్లాలకు వెళ్లాలని చెప్పారు. వెనుకబడిన మున్సిపాలిటీలను విశ్లేషించాలని అన్నారు. రోజువారీ రిపోర్ట్ తనకు అందించాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలను బుజ్జగించాలని అన్నారు. పాత, కొత్త నేతలు అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జులదే గెలుపు బాధ్యత అని అన్నారు. ఒక్కటి మిస్సవ్వకుండా అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని చెప్పారు.

బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో, 5న కరీంనగర్ జిల్లా చొప్పదండిలో, 6న నిజామాబాద్ జిల్లాలో, 7న రంగారెడ్డి జిల్లాలోని పరిగిలో, 8న వరంగల్ జిల్లాలోని భూపాలపల్లిలో, 9న మెదక్ లో ఎన్నికల సభల్లో రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కోసం షార్ట్‌ఫిల్మ్‌లు

నేను తీయడానికి సిద్ధం

అందరూ జాగ్రత్తగా ఉండాలి

ఈ మహమ్మారిని తరిమికొట్టాలి

శరీరం చెప్పే మాట వినాలి

మెగాస్టార్ చిరంజీవి

హైదరాబాద్, ప్రజాస్వరం
భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు మెగాస్టార్ చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలన్నారు.
''గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలి'' అని చిరంజీవి అన్నారు.

మత రాజకీయాలను ప్రజలు సహించరు

బీజేపీ నేతల ఉచ్చులో పడొద్దు

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, ప్రజాస్వరం
మతం పేరుతో చేసే రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించరని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గాంధీ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. జీఎస్టీలో మార్పు వల్ల రాష్ట్రం రూ.7 వేల కోట్ల ఆదాయం కోల్పోయిందని తెలిపారు. దేవుళ్ల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నేతల ఉచ్చులో పడొద్దని మహేశ్ గౌడ్ తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కిషన్ రెడ్డి ఏ రోజూ స్పందించలేదని ఆరోపించారు. "కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాభివృద్ధి మాత్రమే ముఖ్యం.. మత రాజకీయం మేం చేయం" అని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు విజ్ఞులు.. కులమత రాజకీయాల ఉచ్చులో పడరని తెలిపారు. కేంద్ర బడ్జెట్ లో దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ లో ప్రధాని మోదీ పేరు వినిపిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఆరోపించారు.బీజేపీ నేతలు మతం పేరుతో రెచ్చగొడితే తెలంగాణ ప్రజలు ఊరుకోరన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తెచ్చిన బిల్లులను ఎందుకు ఆమోదించలేదో బీజేపీ నేతలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకానికి నిధులు ఎందుకు కోత పెట్టారో బీజేపీ చెప్పాలన్నారు.

సిట్ విచారణ పేరుతో డైవర్షన్...

బినామీ వ్యవహారం బయటకు రాకుండా ఉండేందుకే ఇదీ..

ఇన్‌ఫ్రా కంపెనీలో సీఎం పెట్టుబడులు

మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ప్రజాస్వరం

దివాలా తీసిన ఇన్ ఫ్రా సంస్థకు రూ.6 వేల కోట్ల టెండర్లు ఇచ్చారని, గతంలో రేవంత్ పై ఐటీ సోదాలు జరిగాయి. ఇన్ ఫ్రా కంపెనీలో సీఎం పెట్టుబడులు ఉన్నాయని, 2023లోనే కేఎల్ ఎస్ ఆర్ సంస్థ దివాలా తీసిందని,. ఈ కంపెనీకి ఎందుకు టెండర్లు ఇచ్చారని సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిందని, ఈ బినామీ వ్యవహారం బయటకు రాకుండా చేయాలనే సిట్ విచారణతో డ్రామా ఆడుతున్నారు అని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సిట్ విచారణ పేరుతో డైవర్షన్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వరుసగా విచారణ చేస్తుంటే అనుమానం వచ్చిందని తెలిపారు. ఆరా తీస్తే సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారం బయటపడిందన్నారు. తెలంగాణ భవన్ లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.రేవంత్ రెడ్డి బినామీ కంపెనీకి సుప్రీంకోర్టు ఇటీవల నోటీసులు ఇచ్చిందన్నారు.

పార్టీ ఫిరాయింపు కేసు కడియం శ్రీహరి విచారణ వాయిదా

హైదరాబాద్,ప్రజాస్వరం

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధ వారం స్పీకర్ ఎదుట పార్టీ ఫిరాయింపు కేసులో విచారణకు హాజరయ్యారు. ఆయనపై పిటిషన్ వేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కూడా విచారణకు హాజరై తన వాదనలు వినిపించగా.. స్పీకర్ వాటిని రికార్డ్ చేశారు. తనవద్ద ఉన్న సాక్ష్యాధారాలను స్పీకర్ కు అందించారు. మున్సిపల్ ఎన్నికలు, ఫలితాలు అన్నీ పూర్తయ్యాక ఈనెల 19న మరోసారి విచారణకు హాజరు కావాలని స్పీకర్ ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేశారు.

సంజయ్ కు క్లీన్ చిట్

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ మరో ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్లుగా పిటిషన్ దాఖలవ్వగా.. దానిపై స్పీకర్ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సంజయ్ పార్టీ మారారనేందుకు సరైన ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పై కేసు

పోలీసుల విధులకు ఆటంకం, దుర్భాషలాడారని ఫిర్యాదు

హైదరాబాద్, ప్రజాస్వరం

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు కేసు బుక్ చేశారు. కేసీఆర్ సిట్ విచారణ సందర్భంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ పై జీవన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు.బేదిరింపులు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.